క్లుప్తంగా

కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న నాయకులు

ఇచ్ఛాపురం రూరల్: మండపల్లి పంచాయతీలోని కొండి వీధిలో 15వ ఆర్థిక సంఘ నిధులు లక్ష రూపాయలతో చేపట్టనున్న డ్రైన్, కల్వర్ట్ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. స్థానిక నాయకులు పిట్ట శశిరేఖ రెడ్డి, మామయ్యరెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న సంతోష్‌కుమార్

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 20వవార్డు పరిధిలోని లేబర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాన్ని మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్‌కుమార్ శనివారం పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు చార్ట్ ప్రకారం పాలు, గుడ్లు అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పిల్లల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ చూపాలని కేంద్రం సిబ్బందికి సూచించారు. రికార్డులను పరిశీలించారు.

క్షేత్ర సందర్శనతో మరింత విజ్ఞానం



క్షేత్ర సందర్శన చేస్తున్న విద్యార్థులు

టెక్కలి: విద్యార్థులకు క్షేత్ర సందర్శనతో మరింత విజ్ఞానం చేకూరుతుందని టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ అన్నారు. కళాశాలకు చెందిన బీఎస్సీ తృతీయ సంవత్సరం విద్యార్థులంతా శనివారం టెక్కలి మండలం లింగాలవలస గ్రామంలోని చేపల పెంపకం కేంద్రాలను పరిశీలించారు. సందర్భంలో వైస్ ప్రిన్సిపాల్ బి.సతీష్‌కుమార్, అధ్యాపకులు వి.ల్యూక్‌పాల్, జువాలజీ అధ్యాపకులు ఎస్‌హెచ్ కె.జనార్దన్, సుగుణాధరావు, శివాజీ, చౌదరి పాల్గొన్నారు.

నేడు ఉద్దానం కిడ్నీ విషాదాలు పుస్తకావిష్కరణ

పలాస: పలాస మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం ఉదయం పంది గంటలకు 'ఉద్దానం కిడ్నీ విషాదాలు'పుస్తకావిష్కరణ జరుగునుందని గిడుగు రామ్మూర్తి తెలుగు భాషా జానపద కలాపీఠం అధ్యక్షుడు బద్రి కూర్మారావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పుస్తకాన్ని ద్రవిడ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ కె.ఎస్.చలం ఆవిష్కరిస్తారన్నారు. కళింగ సీమ సాహిత్య సంస్థ అధ్యక్షుడు సన్నశెట్టి రాజశేఖర్ అధ్యక్షతన జరుగునున్న కార్యక్రమంలో కవులు, రచయతలు, కళాకారులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొంటారన్నారు.

బైపల్లిలో నేటి నుంచి దసరా మహోత్సవాలు



చింతలపోలమ్మ అమ్మవారు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని బైపల్లి గ్రామంలో కొలువుదీరిన వనదేవతలు చింతలపోలమ్మ, పాలపోలమ్మ, కొత్త అమ్మవార్ల దసరా మహోత్సవాలు ఆదివారం నుంచి ఈ నెల ఎనిమిదో తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు కొత్తఅమ్మ వారి పూజా కార్యక్రమం, చలిపందిరితో వేడుకలు ప్రారంభ కానున్నాయి. ఎనిమిదో తేదీన అమ్మవారి పత్ర కైవయం, అమ్మవార్ల పతాకావిష్కరణతో పాటు ఘాటాలతో ఊరేగింపు, చల్లదనం కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

స్వేచ్ఛావతికి ఎమ్మెల్సీ పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న రామారావు దంపతులు

ఇచ్ఛాపురం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఇచ్ఛాపురం గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారిని ఎమ్మెల్సీ నర్తు రామారావు, చామంతి దంపతులు శనివారం దర్శించుకున్నారు. మూడవ రోజైన శనివారం స్వేచ్ఛావతి అమ్మవారు చంద్రఘంట అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

జయహో దుర్గాభవానీ..



స్వేచ్ఛావతి సన్నిదానంలో భవానీ స్వాములు



పూజలు చేస్తున్న భవానీ దీక్షాపరులు



భవానీ సన్నిధానం

- ఆధ్యాత్మికత కోసం భవానీదీక్ష స్వీకరిస్తున్న భక్తులు

ఇచ్ఛాపురం రూరల్: ప్రజల్లో భక్తిభావం పెరుగుతోంది. దీంతో భవానీ, అయ్యప్ప, ఆంజనేయ మాలధారణ చేసే వారి సంఖ్య ఏటా పెరుగుతోంది. దుర్గానవరాత్రులు ప్రారంభం కావడంతో ప్రస్తుతం నవశక్తి దుర్గామాత మాలధారణ (దీక్ష) తీసుకునేందుకు యువత ముందుకొస్తున్నారు. స్వేచ్ఛావతి అమ్మవారి సన్నిధి కేంద్రంగా ఒక్క ఇచ్ఛాపురంలోనే 200 మందికి పైగా భవానీ దీక్షాపరులు ప్రస్తుతం ఉన్నారు. పోలాల అమావాస్య మరుసటి రోజు పాడ్యమి రోజున దీక్ష తీసుకొని నవమి (తొమ్మిది) రోజుల వరకు దీక్షలు తీసుకొని పది, పదకొండవ [illegible] రోజున కొంత మంది స్థానిక బహుదానదిలో పుణ్యస్నానం చేసి దీక్ష విరమిస్తే, విజయవాడ కనకదుర్గా ఆలయానికి వెళ్లి వందలాది మంది భక్తులు దీక్ష విరమిస్తారు. అమ్మవారు అందరినీ చల్లగా కాపాడే తల్లిగా ప్రజలు భావిస్తారు. ప్రతి ఒక్కరికీ ఇచ్ఛా శక్తి, క్రియా శక్తి, జ్ఞాన శక్తులను ఏకీకృతం చేసుకోవడానికి ఈ ఏడాది నవ రాత్రులలో భవానీ మాలధారణ చేసేందుకు యువకులు అధిక సంఖ్యలో దేవీ దీక్షాపరులుగా మారారని గురు భవానీ స్వాములు చెబుతున్నారు. భవానీ మాల స్వీకరించిన సమయంలో భక్తులు నిత్యం అమ్మవారి నామస్మరణ చేస్తుంటారు. ఇతరులను పలకరించే ముందు 'భవానీ'అని పలకరిస్తారు. ఈ దీక్ష ధరించిన వారు కాషాయ వస్త్రాలు ధరిస్తారు.

పదేళ్లుగా దంపతుల మాలాధారణ

పదేళ్ల నుంచి నా భార్య ధనలక్ష్మితో ఏటా దసరాకు భవానీ మాలాధారణ చేస్తున్నాం. ఈ ఏడాది కూడా దీక్ష బూనాం. ఇంట్లోనే సన్నిధానం ఏర్పాటు చేసుకుంటూ పదకొండు రోజుల పాటు ప్రత్యేక పూజలు చేస్తుంటాం. మమ్మల్ని చూసిన చాలా మంది మాలాధారణ చేస్తున్నారు. నియమ నిష్టలతో దీక్ష చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

– దుక్క ఆనంద్ ధనలక్ష్మి, సర్పంచ్, కొత్తూరి గ్రామం

ప్రవర్తనలో మార్పు

నవశక్తి దుర్గామాత అమ్మవారి దీక్షతో వ్యక్తిగత ప్రవర్తనలో మంచి మార్పు వస్తుంది. అత్యంత నియమ నిష్టలతో దీక్షను ఆచరిస్తే జీవనశైలి సన్మార్గంలో నడుస్తుంది. దీక్ష స్వీకరణతో మానసికంగా, ఆరోగ్యంగా తయారవుతాం. ఆధ్యాత్మిక భావాలతో ఉంటే అన్నీ మంచిగా జరుగుతాయి. నేను గురు స్వామిగా వ్యవహరిస్తున్నాను. మా సన్నిధానంలో 127 మంది భవానీ దీక్షాపరులు ఉన్నారు.

– రవి గురుస్వామి, ఇచ్ఛాపురం

భక్తి భావంతో దీక్ష చేస్తున్నాం

నేను తొలి సారిగా మాతా భవానీ దీక్షను తీసుకున్నాను. నాతో మాలాధారణ చేసిన భవానీ స్వాములు సీనియర్లు. వారి పూజా విధానం నాలో ఆధ్యాత్మికత్వాన్ని నింపుతోంది. ఆశ్రమంలో ఉంటూ భక్తులతో సేవా కార్యాక్రమాల్లో పాల్గొవడం ఆనందంగా ఉంది.

– తిప్పన దుర్యోధన రెడ్డి, బెన్నుగానిపేట

జిల్లా ఆస్పత్రిలో రోగుల ఇక్కట్లు!



బాలింతల వార్డు బయట చెప్పల స్టాండ్ వద్ద కూర్చున్న రోగులు



ఆపరేషన్ థియేటర్ బయట ఇలా..



మెట్లపై కూర్చున్న రోగులు

టెక్కలి రూరల్: ఆంధ్రప్రదేశ్ వైద్యవిధాన పరిషత్ ఆధ్వర్యంలో నడుస్తున్న టెక్కలిలోని జిల్లా ఆస్పత్రిలో రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రోగులు, వారితో వచ్చే బంధువులు కూర్చోవడానికి సైతం సరైన సౌకర్యాల్లేవు. ప్రధానంగా గర్భిణుల, బాలింతల వార్డుల వద్ద వసతుల్లేవు. దీంతో వరండాలో చెప్పులు పెట్టుకునే ప్రదేశంలోనే గర్భిణులు, బాలింతలు, వారితో వచ్చే సహాయకులు కూర్చోవలసిన పరిస్థితి. ఆపరేషన్ థియేటర్ బయట సైతం కుర్చీలు లేకపోవడంతో మెట్లు పైన, థియేటర్ బయట అరుగులపైన కూర్చుతున్నారు. ఆస్పత్రిలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెంనాయుడు పదేపదే చెబుతున్నప్పటికీ ఫలితం లేదు.

బాబా భక్తుల భిక్షాటన



భిక్షాటనలో షిర్డీసాయి భక్తులు

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్ రోడ్డులోని షిర్డీసాయి బాబా ధ్యాన మందిరంలో దసరా ఉత్సవాలు, బాబా మహాసమాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని భిక్షాటన కార్యక్రమాన్ని బాబాభక్తులు శనివారం నిర్వహించారు. రెండు రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందని భక్తులు తెలిపారు. పలాస–కాశీబుగ్గ జంట పట్టణాల్లో భక్తుల నుంచి బియ్యంతో పాటు నగదు సేకరించి విజయదశమి రోజున అన్నాభిషేకం, మహాఅన్నదాన కార్యక్రమం చేపడతామని సంస్థ కార్యదర్శి గిన్ని జయశంకరరెడ్డి, ఆలయ మేనేజర్ ఎ.సాంబవమూర్తి తెలిపారు. బాబా భక్తులు అంబుసోలి, శివాజీనగర్, శ్రీనివాసనగర్, నెహ్రూనగర్, పెంటవీధి, డెంకివీధి, న్యూకాలనీ, పల్లివీధి బజారువీధి, ఎంపీడీవో కార్యాలయ ప్రాంతాల్లో భిక్షాటన చేశారు.

టెక్కలి ఆర్డీవో బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న కృష్ణమూర్తి



వసంతకుమార్‌తో పంచాయతీ కార్యదర్శులు

టెక్కలి: టెక్కలి ఆర్డీవోగా నియమితులైన మడక కృష్ణమూర్తి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు కార్యాలయ సిబ్బంది సాదరంగా స్వాగతం పలికారు. శాస్త్రోక్తంగా కుటుంబ సభ్యుల నడుమ బాధ్యతలు చేపట్టారు. 2023 గ్రూప్–1 కేడర్‌కు చెందిన కృష్ణమూర్తి గతంలో పోలీస్ శాఖలో ఎస్ఐగా పనిచేశారు. శిక్షణ పూర్తి చేసుకుని మొట్టమొదటి సారిగా టెక్కలి ఆర్డీవో నియమితులయ్యారు.

పలాస ఎంపీడీవోగా వసంతకుమార్

పలాస: పలాస మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా కె.వసంతకుమార్ బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎన్.రమేష్‌నాయుడు వజ్రపుకొత్తూరు మండలానికి బదిలీ అయ్యారు. అతని స్థానంలో కాకినాడలో పనిచేసిన వసంతకుమార్ విధుల్లో చేరారు. ఆయనకు పంచాయతీ కార్యదర్శులు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. కార్యదర్శుల సంఘం నాయకులు ఎల్.శ్రీధర్, ఫాల్గుణరావు, సద్గుణరావు, రేఖ, పంచాయితీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు ఉన్నారు.

పలాస రైల్వేస్టేషన్‌ను సుందరీకరణ చేయాలి



రామ్మోహన్‌నాయుడు, పరమేశ్వర్ పంక్వాల్‌కు వినతి అందిస్తున్న పలాస నాయకులు

కాశీబుగ్గ: ఈస్ట్ కోస్ట్ రైల్వే ఖుర్దా రైల్వే డివిజన్ పరిధిలో ఎక్కువ ఆదాయం తెచ్చిపెడుతున్న పలాస రైల్వేస్టేషన్‌ను సుందరీకరణ చేయాలని బీజేపీ సీనియర్ నాయకులు లక్కోజి ధర్మారావు కోరారు. ఈ మేరకు భువనేశ్వర్ రైల్వే ఉన్నత అధికారుల మందిరంలో కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ పంక్వాల్‌లను కలిసి వినతిపత్రం అందించారు. పలాస రైల్వేస్టేషన్ సుందరీకరణ పనులలో భాగంగా జీడిపప్పు పంట, జీడి పరిశ్రమల చరిత్ర ఆర్ట్స్, హోర్డింగ్‌ల రూపంలో చేర్చమని వినతిపత్రంలో కోరారు.

ఆశ్రమ పాఠశాలకు ప్రహరీ నిర్మించాలి

పలాస: లొత్తూరు గిరిజన ఆశ్రమ పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన అభ్యుదయ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. పంచాయతీ సర్వసభ్య సమావేశం సర్పంచ్ సవర పాపారావు అధ్యక్షతన శనివారం జరిగింది. సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. మెళియాపుట్టి, పాతపట్నం మండలాల్లో ఐటీడీఏ నోడల్ ఏజెన్సీలను ఏర్పాటు చేయాలని, గిరిజన గ్రామాకు తారురోడ్లు మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో మాజీ సర్పంచి ఎస్.మోహనరావు, సంఘనాయకులు ఎస్.నారాయణరావు, ఎస్.నరిసింహులు, సవర మంగళో పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయ నిర్మాణానికి వినతి



మంత్రి అచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: కోటబొమ్మాళిలో కొత్తగా మండల విద్యాశాఖ కార్యాలయం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎంఈవో ఎల్.వి.ప్రతాప్‌తో పాటు ఉపాధ్యాయులు కోరారు. ఈ మేరకు వ్యవసాయశాఖామంత్రి కె.అచ్చెన్నాయుడుకు శనివారం వినతి పత్రం అందజేశారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో కొత్తగా భవనం నిర్మాణం చేపడతామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గొండు నారాయణరావు, వై.వాసుదేవరావు, కమలాభాయ్ పాల్గొన్నారు.

కిడ్నీ రోగికి ఆర్థిక సాయం



కిడ్నీ రోగికి సాయాన్ని అందజేస్తున్న దృశ్యం

సోంపేట: గొల్లగండి పంచాయతీ రామయ్యపట్నం గ్రామానికి చెందిన మెట్ట శ్రీనివాసరావు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఈయనకు సోంపేటకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు నగిరి బెనర్జి రూ. ఐదు వేలు ఆర్థిక సాయాన్ని శనివారం అందజేశారు.

సర్పంచ్ కుటుంబానికి జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ



ప్రకాష్‌ను పరామర్శించిన చైర్‌పర్సన్ విజయ

కవిటి: బిగొనవపుట్టుగ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత బద్రి ప్రకాష్ తల్లి రమణమ్మ అనారోగ్యంతో ఇటీవల చనిపోయారు. దీంతో ప్రకాష్ కుటుంబ సభ్యులను శ్రీకాకుళం జెడ్పీ చైరపర్సన్ పిరియా విజయ శనివారం పరామర్శించారు. రమణమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. స్థానిక పార్టీ నాయకులు పిరియా కృష్ణారావు, పూడి ప్రతాప్ ఉన్నారు.

సారా అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి

- ఎక్సైజ్ సీఐ పీడీ ప్రసాద్



పీడీ ప్రసాద్

ఇచ్ఛాపురం రూరల్: ఆంధ్రా–ఒడిశా సరిహద్దుల్లో నాటు సారా అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి అడ్డుకట్ట వేస్తామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పీడీ ప్రసాద్ అన్నారు. బదిలీపై ఇచ్ఛాపురం ఎక్సైజ్ శాఖ సీఐగా విధుల్లో చేరిన ఆయన శనివారం మాట్లాడారు. ఇచ్ఛాపురం సర్కిల్ పరిధిలో ఇచ్ఛాపురం, కవిటి మండలాల్లో అన్ని మద్యం దుకాణాల ఎంపిక ప్రక్రియకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. ఇచ్ఛాపురం మండలానికి సంబంధించి మూడు, ఇచ్ఛాపురం పట్టణంలో రెండు, కవిటి మండలానికి మూడు మద్యం షాపులు కేటాయిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తిగల వారు తమ దరఖాస్తులను ఈ నెల తొమ్మిదో తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు తమ కార్యాలయంలో అందజేయాలన్నారు. 11వ తేదీన ఉదయం ఎనిమిది గంటల నుంచి శ్రీకాకుళం అంబేడ్కర్ ఆడిటోరియంలో లాటరీ ద్వారా కేటాయిస్తారన్నారు

ఆదర్శ కోనేరుగా తీర్చిదిద్దాలని విజ్ఞప్తి



కలుషితమైన వజ్రాల చెరువు నీరు

వజ్రపుకొత్తూరు రూరల్: మండల కేంద్రమైన వజ్రపుకొత్తూరులోని వజ్రాల కోనేరును అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామ ముఖద్వారం దగ్గర ఉన్న ఈ చెరువును అభివృద్ధి చేస్తే గ్రామ రూపురేఖలు మారుతాయని, అలాగే అహ్లాదకరమైన వాతావరణం ఉండటంతో పర్యాటక కేంద్రంగా మారుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. అయితే ప్రస్తుతం ఈ చెరువులో ప్లాస్టిక్ వస్తువులు, చెత్త చెదారం పేరుకుపోయి కాలుష్య కోరల్లో చిక్కుకుందన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చొరవ చూపి కోనేరును అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు.

మోడల్ స్కూల్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్



పీహెచ్‌సీని సందర్శించిన విద్యార్థులు

కంచిలి: మఠంసరియాపల్లి లోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఐటీఈఎస్ విభాగంలో 12 రోజుల ఇంటర్న్‌షిప్‌పై శిక్షణ కార్యక్రమాన్ని దసరా సెలవుల్లో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.శివప్రసాద్ పర్యవేక్షణలో ఒకేషనల్ ట్రైనర్ ఒరియా సత్యన్నారాయణ ఆధ్వర్యంలో వివిధ సంస్థల పనితీరును విద్యార్థులకు వివరించి అందులో అవగాహన, శిక్షణ కల్పిస్తున్నారు. శనివారం మఠంసరియాపల్లి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఏపీజీవీబీ, పోస్టాఫీసు, గ్రామవార్డు సచివాలయం, కంచిలిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల తదితర సంస్థల్ని విద్యార్థులు సందర్శించారు. అక్కడ సిబ్బంది నిర్వర్తిస్తున్న విధుల్ని అడిగి తెలుసుకొన్నారు.

స్వయంశక్తి సంఘాలను బలోపేతం చేయాలి



సిబ్బందికి సూచనలిస్తున్న ఏపీఎం ప్రసాదరావు

కంచిలి: స్వయంశక్తి సంఘాలను బలోపేతం చేయాలని ఏ.పి.ఎం. ఎస్. ప్రసాదరావు అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఈ విషయమై సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని శనివారం నిర్వహించారు. మొబైల్ బుక్ కీపింగ్‌లో సూచించిన ప్రకారం జరగాలని, అన్ని సంఘాలు ఏ గ్రేడ్‌లో ఉండాలన్నారు. గ్రామ సంఘ సమావేశాలను నెలకు రెండుసార్లు నిర్వహించాలన్నారు. అలాగే మండలానికి కొత్తగా సీసీలుగా బాధ్యతలు చేపట్టిన ఎస్.ధనలక్ష్మి, యు.రాణి, ప్రమీలదేవి, సిబ్బంది బి.పాపారావు, సీవో భవానీ, అకౌంటెంట్ స్వప్న పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

ఏపీటీపీసీ చైర్మన్‌కు సత్కారం

కాశీబుగ్గ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ (ఏపీటీపీసీ) చైర్మన్‌గా ఇటీవల నియమితులైన వజ్జ బాబూరావును పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ మెప్మా విభాగానికి చెందిన ఉద్యోగులు, సిబ్బంది శనివారం సత్కరించారు. నాయకులు పీరుకట్ల విఠల్‌రావు, డొక్కరి శంకరరావు, మెప్మా సీఎంఎం పిన్నింటి మోహనరెడ్డి, సీవో బాలరాజు, సీఎల్ఆర్‌పీలు తులసీ, పద్మావతి, కవిత, పుణ్యావతి ఉన్నారు.

స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ 16వార్డు ఫకీర్‌పేటలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాల పరిసరాల్లో స్పీడ్‌బ్రేకర్లను మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ ఉలాల భారతిదివ్య పర్యవేక్షణలో శనివారం ఏర్పాటు చేశారు. పాఠశాల పరిసరాల్లో నివాసముంటున్న ప్రజల అభ్యర్థన మేరకు వైస్‌చైర్‌పర్సన్ ప్రత్యేక కృషిచేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

టెక్కలి రూరల్: సంతబొమ్మాళి మండలం పెద్ద తుంగాం గ్రామం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చాకిపల్లి గ్రామానికి చెందిన యువకుడు దల్లి సంతోష్ గాయపడ్డారు. సంతోష్ ద్విచక్ర వాహనంపై సంతబొమ్మాళి వైపు వెళ్తుండగా తుంగాం గ్రామం నుంచిఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. గాయపడిన సంతోష్‌ను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించగా.. ప్రాథమిక చికత్స అనంతరం మేరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు.

అంధకారంలో సైనిక్‌నగర్

టెక్కలి: తొలుసూరుపల్లి పంచాయతీ సైనిక్‌నగర్‌లో కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగకపోవడంతో కాలనీవాసులు అంధకారంలో అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో వీధి దీపాల్లేక విష సర్పాల బెడద భయాందోళనకు గురి చేస్తోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వీధి దీపాలు వేయాలని కోరుతున్నారు.

విద్యార్థి దశ నుంచి ఉపాధిపై దృష్టిపెట్టాలి

సోంపేట: విద్యార్థి దశ నుంచే ఉపాధి అవకాశాలపై దృష్టిపెట్టాలని ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ చిన్నాజీ వర్మ అన్నారు. సమగ్ర శిక్షా, ఆంధ్రప్రదేశ్ ఒకేషనల్ ట్రేడ్ పాట్నర్ యువశక్తి ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ కోసం ఎంపిక చేశారు. పది రోజుల ఇంటర్న్‌షిప్ పోగ్రాంలో భాగంగా సన్‌షైన్ బ్యూటీ పార్లర్‌లో విద్యార్థినులకు శిక్షణ అందజేయనున్నట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

రాజేశ్వరరావుకు గురుబ్రహ్మ అవార్డు



తూర్పుగోదావరి డీఈవో వాసుదేవరావు నుంచి అవార్డు అందుకుంటున్న రాజేశ్వరరావు

కోటబొమ్మాళి: కురుడు హైస్కూల్‌లో సోషల్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న కరిమి రాజేశ్వరరావు గురుబ్రహ్మ అవార్డును అందుకున్నారు. రాజమండ్రికి చెందిన గోదావరి, రాజమండ్రి విద్యా అకాడమి స్వచ్ఛంద సంస్థలు అంతర్‌జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం గురుబ్రహ్మ అవార్డును ప్రదానం చేసి సత్కరించాయి. అవార్డును తూర్పుగోదావరి డీఈవో వాసుదేవరావు చేతుమీదుగా రాజేశ్వరరావు అందుకున్నారు. సృజనాత్మక బోధన, సామాజిక స్పృహ, చైతన్యం, సేవా కార్యక్రమాల్లో మంచి ప్రతిభకనబరిచినందుకు రాజేశ్వరరావు గురుబ్రహ్మ అవార్డుకు ఎంపికయ్యారు.

లైన్‌మెన్ మృతికి సంతాపం

టెక్కలి: టెక్కలి విద్యుత్‌శాఖ లైన్‌మెన్ కూన సింహాచలం శనివారం మృతి చెందారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఈయన తన సొంత గ్రామం ఎర్రన్నపేటలో ప్రాణం విడిచారు. సింహాచలం మృతిపై విద్యుత్ శాఖ అధికారులతో పాటు సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానం

వజ్రపుకొత్తూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన మద్యం పాలసీ విధానంలో మద్యం షాపుల అనుమతి కోసం ఆసక్తి ఉన్నవారు ఈ నెల తొమ్మిదో తేదీ సాయంత్రం ఐదు గంటలలోగా దరఖాస్తులు చేసుకోవాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కె.మల్లికార్జునరావు తెలిపారు. పలాస నియోజకవర్గానికి సంబంధించి వజ్రపుకొత్తూరు మండలానికి ఐదు, కాశీబుగ్గ మున్సిపాలిటీ, పలాస మండలానికి పది దుకాణాల ఏర్పాటు కోసం దరఖాస్తులు కోరుతున్నామన్నారు.

విశ్రాంత ఎంఈవో మృతి

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ ఏడో వార్డు చినబడంలో ఉంటున్న విశ్రాంత ఎంఈవో బడగల నరసింహులు అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఈయన భార్య కూడా కొద్ది రోజుల క్రితమే కాలం చేశారు. ఈయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పలాస, వజ్రపుకొత్తూరు, ఇచ్ఛాపురం, దోనుభాయి, సీతంపేట, గార మండలాల్లో పని చేశారు. ఈయన మృతిపై పలువురు సంతాపం తెలియజేశారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాలకు ఈనెల ఏడో తేదీ ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్టు పలాస డివిజన్ విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.యగ్నేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 11 కేవీ చినబాడం ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపడుతున్న కారణంగా మూడో వార్డులోని పెంటిబద్ర, జయరామచంద్రపురం, నాలుగో వార్డు పరిధి పద్మనాభపురం కాలనీ, ఓల్డ్ ఎన్‌హెచ్–5 రోడ్డు, అంబుసోలి, ఐదోవార్డు తాళ్లభద్ర, నీలాపురం, ఆరు వార్డులోని నర్సిపురం, రైల్వేగేట్ డౌన్, పెసరపాడు, ఏడోవార్డులో చినబాడం, అంతరకుడ్డ పరిసర ప్రాంతాలకు సరఫరా ఉండదని.. వినియోగదారులు గమనించాలని కోరారు.

దుర్గామాత మండపంలో హుండీ అపహరణ

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి మారుతీనగర్‌లో శుక్రవారం రాత్రి దొంగతనం జరిగింది. శరవన్నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద అర్ధరాత్రి దొంగలు చొరబడి హుండీని దోచుకుపోయారు. సుమారు రూ. 40 వేలు ఉండవచ్చునని నిర్వహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మోహనరావు తెలిపారు.

యువకుల కొట్లాట!

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోని బస్టాండ్ సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్‌కు సమీపంలో యువకులు శనివారం కొట్లాటకు దిగారు. ఓ ప్రైవేటు కళాశాలకు చెందిన యువకులు రెండు వర్గాలుగా విడిపోయి పిడుగుద్దులతో ఒకరిపై ఒకరు దాడిచేసి కొట్టుకున్నారు. ఈ క్రమంలో పలు వాహనాలు పడిపోయి. అదే సమయంలో అటుగా పోలీసు వాహనం రావడంతో యువకులు అక్కడి నుంచి పరుగులు పెట్టారు.